కథ

# జలమూల మిదం జగత్!

-అర్చనా చౌహాన్.

కేరాఫ్:డాక్టర్ కె.పుష్ప
ఇ.నం.16-2-145/ఎ/9
జడ్జెస్ కాలనీ
మలక్‌పేట్, హైదరాబాద్.

"జలజా! అమ్మాయ్ జలజా!" పక్కింటి పిన్నిగారు తలుపులను దడదడా బాదేస్తూ అరుస్తున్నారు.

ఆవిడ అరుపులు విని వంటింట్లో కూరలు తరుగుతోన్న జలజ ఉలిక్కిపడింది. పిన్నిగారు ఇంతగా కేకలెడ్తున్నారంటే ఏదో ఉపద్రవం ముంచుకొచ్చిం దన్నమాటే!

జలజ తను చేస్తోన్న పని మధ్యలోనే ఆపేసి వెళ్ళి తలుపుతీసింది. ఎదురుగా పిన్నిగారు హైరానా పడ్తూ కనిపించారు.

"ఏంటండి పిన్నిగారూ! ఏమైందీ?"

"రాంబాబు వస్తున్నాట్ట. రెడీగా ఉండు." ఆవిడ కంగారుగా చెప్పేసి అదే కంగారుతో తన పోర్షన్లోకి వెళ్ళిపోయింది.

ఆ మాట వినేసరికి జలజ పక్కలో బాంబు పడ్డట్టుగా అదిరిపడింది.

"రాంబాబు వస్తున్నాడా? అయ్యో! ఇప్పుడేమిటి చెయ్యడం? సమయానికి ఈయన కూడా ఇంట్లో లేరు" గాభరాగా బయటకు పరుగు తీసింది.

బయట వీధిలో కోలాహలంగా ఉంది. ఎవరికి వారే హడావిడి పడ్తున్నారు. రాంబాబు వస్తున్నాడంటే హడావిడి పడాల్సిందే మరి!

పిన్నిగారి కోడలైన సువర్ణ, జలజ అలా వట్టిచేతుల్తో పరిగెత్తుకు రావడం చూసి.

"అదేమిటి జలజా! అలా వట్టి చేతుల్తోనే వచ్చావు? త్వరగా వెళ్ళు! రాంబాబు ఏ క్షణమైనా రావచ్చు" అంటూ హెచ్చరించింది.

"అవునూ! తను ఇలా వచ్చేసిందేంటి?" అని జలజ కూడా ఆశ్చర్యపోయింది.

ఏ వేగంతో బయటకు వచ్చిందో తిరిగి అదే వేగంతో ఇంట్లోకి పరిగెత్తింది.

"ఈ రాంబాబు ఎప్పుడు ఊడి పడ్తాడో ఎవరికీ తెలీదు. ఈయన కూడా తగుదునమ్మా అని సెలవురోజున కూడా ఇంటిపట్టున ఉండరు. ఈ ఒక్కరోజు ఇంట్లో ఉండి ఉంటే ఏంపోయేదీ?"

స్పెషల్ క్లాస్ అంటూ ఆదివారం కూడా కాలేజీకి వెళ్ళిన భర్తను మనసులోనే తిట్టుకుంది.

రాంబాబు వస్తున్నాడంటే జలజకెప్పుడూ గుండె దడే! పై పెచ్చు వాళ్ళాయన ఇంట్లో లేనప్పుడు వస్తున్నాడంటే కాళ్ళూచేతులూ ఆడవు.

జలజ భర్త ప్రసాద్‌రావు ఒక ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్. జలజ పెళ్ళయ్యాక కాపురానికి హైదరాబాద్ వచ్చి దాదాపు ఏడాది కావస్తోంది. ఈ ఏడాది కాపురంలో వాళ్ళు మూడుసార్లు ఇల్లు మారారు.

కారణం... నీటి సమస్య!

హైదరాబాద్‌లో అద్దె ఇళ్ళలో నివసించే మధ్య తరగతి కుటుంబాలు ఎదుర్కొనే కామన్ సమస్య!

సిటీ మధ్యలో ఇల్లు దొరికినా అద్దెలు మరీ ఎక్కువ, సౌకర్యాలు మరీ తక్కువ!

ముఖ్యంగా నీళ్ళ విషయంలో ఇంటి ఓనర్లు చూపించే పిసినారితనాన్ని భరించలేక విసిగి వేసారి పోయింది జలజ.

మరీ స్నానానికి నీళ్ళు వదలడానిక్కూడా ఓ ఇదయి పోయేవాళ్ళని చూసి ఏమనాలో అర్థంకాలేదు ఆమెకు.

గోదారి ఒడ్డునే ఉన్న ఊళ్ళో పుట్టి పెరిగిన జలజకు నీటి సమస్య ఇలా ఉంటుందని మొదటిసారిగా తెల్సింది.

వెతగ్గా, వెతగ్గా చివరికి సిటీ ఔట్ స్కర్ట్స్‌లో అప్పుడప్పుడే డెవలప్ అవుతున్న ఓ చిన్న కాలనీలో ఓ అందమైన ఇల్లు దొరికింది.

నీటి సమస్య లేదుకదా అని ఓనర్ని అడిగితే.

"అలాంటిదేమీ లేదండి! రోజంతా సొసైటీ వాటర్ వస్తూనే ఉంటుంది. ఎదురుగా హేండ్ పంప్ ఉందిగా! తియ్యటి నీళ్ళు. మీకెందుకూ? నీళ్ళలో మునిగి తేలొచ్చు" ఇంటి ఓనరు చాలా కన్విన్సింగ్‌గా చెప్పాడు.

చక్కని ఇల్లు. అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. ఇంటి ఓనరు ఎక్కడో సిటీలో ఉంటాడు కాబట్టి ఆ బెడద కూడా తప్పింది.

ప్రశాంతమైన పరిసరాలు, అన్నిటినీ మించి పుష్కలంగా నీరు! వెంటనే ఆర్నెల్ల అడ్వాన్స్ ఇచ్చేసి. ఆ ఇంట్లోకి మారిపోయారు.

తీరా ఇంట్లోకి వచ్చి సెటిల్ అయ్యాక అర్థం అయింది ఆ కాలనీలోని మరో తమాషా నీటి సమస్య!

కాలనీలో సొసైటీ వాటర్ రోజంతా వస్తుంది నిజమే, కాని అది ఆ కాలనీకి దగ్గర్లో ఉన్న మందుల ఫ్యాక్టరీ కెమికల్స్‌తో కలుషితమైన నీళ్ళు

ఆ నీళ్ళతో కేవలం స్నానం చేయొచ్చు, బట్టలు ఉతకవచ్చు. అంతే తప్ప వంటకూ తాగడానికీ పనికి రావు.

ఎదురుగా ఉన్న హేండ్‌పంప్ నీళ్ళు వంటకి పనికొచ్చినా, తాగితే మాత్రం... రుచి అదో రకం!

ఇంకొక వింత సమస్య ఏంటంటే ఈ రెండు రకాల నీళ్ళు కూడా తలంటుకోడానికి పనికిరావు. పైగా అదేం ఖర్మో.. ఆ నీటి ప్రభావంతో జుట్టు

విపరీతంగా ఊడ్తుంది!

ఈ లెక్కన ఆ కాలనీ జనం దాహంతోనైనా చావాలి లేదా అందరికీ ఈ పాటికి బట్టతలలైనా అయ్యుండాల్సింది.

కాని ప్రజలు తాగడానికీ, తలంటుకోడానికి మునిసిపాల్టీ నీళ్ళే వాడతారు.

ఇంకా మునిసిపల్ పంపులు అలాట్ కాని ఆ కాలనీకి మునిసిపల్ నీళ్ళు ఎలా వస్తాయీ. అని ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇలాంటివాటికి మునిసిపాలిటీ వాళ్ళు కనుగొన్న ఏకైక సాధనం 'వాటర్ ట్యాంకర్!"

ప్రస్తుతం జలజ వాళ్ళుంటోన్న కాలనీకి మునిసిపల్ నీళ్ళని ట్యాంకర్‌తో తీసుకొచ్చి కాలనీవాళ్ళ అవసరాలు తీర్చే ఆపద్భాంధవుడు... రాంబాబు!

ఆలోచించి చూస్తే సమస్య అంత పెద్దదేమీ కాదు. వాడకానికీ, వంటకీ పుష్కలంగా నీరు దొరుకుతుంది. జస్ట్ తాగడానికీ, వారానికోసారి తలకు ఓ బిందెడునీళ్ళు సరిపోతాయి!

రెండు రోజులకు ఒకసారి ట్యాంకర్‌తో రాంబాబు వస్తూనే ఉంటాడు కాబట్టి అంత పెద్ద సమస్యేమీ కాదని సరిపెట్టుకుంది జలజ.

కాని ప్రాక్టికల్‌గా ట్యాంకర్ వద్ద నీళ్ళు పట్టిందాకా అర్థం కాలేదు జలజకి, ఆ చిన్న సమస్య ఎంత పెద్దదో!



ట్యాంకర్ వద్ద జనాలు నీళ్ళు పట్టరు... యుద్ధాలు చేస్తారు! ట్యాంకర్ రాగానే ప్రశాంతమైనకాలనీ రణ రంగమైపోతుంది.. కాలనీ వాళ్ళంతా యోధులై పోతారు... ఎంతో ఆత్మీయంగా ఉండే ఇరుగు పొరుగు వాళ్ళు బద్ధ శత్రువులైపోతారు.

కాలనీకి వచ్చి రెండు నెలలైనా జలజకి ఈ వ్యవహారమేంటో అస్సలు అంతుపట్టలేదు.

కాలనీలో వీధి వీధికీ ట్యాంకర్ వస్తుంది. మొట్టమొదట ట్యాంకర్ వస్తుందని తెలియగానే వీధిలోని వాళ్ళంతా ఒకరినొకరు హెచ్చరించు కుంటారు.

ఆ తర్వాత వీధిలోని బిందెలన్నీ ఒకచోట చేరతాయి. బిందెల వద్ద అంతా పోగై క్యూ ఎలా కట్టాలా అని తర్జన భర్జన పడతారు.

ఆడాళ్ళ సైడ్‌కి మగాళ్ళు రాకూడదు, క్యూ పద్ధతినే పాటించాలి, ఒకరి తర్వాత ఒకరు నిదానంగా నీళ్ళు పట్టుకోవాలని హితబోధలు చేసుకుంటారు. నవ్వుతూ ఆత్మీయంగా మాట్లాడుకుంటారు. అదంతా ట్యాంకర్ వచ్చేంతవరకే.

ట్యాంకర్ వచ్చి రాగానే నవ్వులూ, హితబోధలన్నీ గాలి కొదిలేసి ట్యాంకర్ మీదకి ఎగబడి పోతారంతా! అప్పుడే మొదలవుతుంది యుద్ధం.

మూర్తిగారనే ముసలాయన అయితే మరీనూ! డెబ్భై అయిదేళ్ళు పైబడినా మనిషి మహా స్ట్రాంగ్. చూడ్డానికి సక్కగా పొడుగ్గా ఉంటారుగానీ ఒక చేత్తో ట్యాంకరు పంపుని పట్టుకున్నారంటే అది విడిపించడం బ్రహ్మతరం కూడా కాదు. పది బిందెలు పట్టందే జరగరు... ఇంకెవ్వర్నీ నీళ్ళు పట్టనివ్వరు.

ఇహ దుర్గమ్మ అని ఇంకో ఆవిడుంటుంది. మనిషెంత లావో గొంతూ అంతే పెద్దది. ఏం నీళ్ళు పడ్తుందోగాని అరిచీ అరిచీ వీధినంతా నెత్తినెత్తు కుంటుంది.

సాధారణంగా వీళ్ళంతా చాలా ఆప్యాయంగా మాట్లాడుతుంటారు. కాని ఒక్కసారి బరిలోకి దిగితే వీళ్ళనాపడం కష్టం. అదీ వరస!

ప్రస్తుతం వీధిలోని వాళ్ళంతా మామూలుగానే బిందెలవద్ద పోగై మాట్లాడుకుంటున్నారు. జలజ కూడా నెర్వస్‌గా నిల్చుంది.

ప్రసాద్ ఉంటే సునాయాసంగా నీళ్ళు పట్టేస్తాడు కాని ఆపని జలజ వల్ల ఎప్పుడూ కాదు. సాధారణంగా

ట్యాంకర్ ప్రసాద్ కాలేజీకి వెళ్ళేలోపే వచ్చేస్తుంటుంది.కాని కర్మకాలి అతను లేనప్పుడు వస్తే మాత్రం ఇంతే సంగతులు.

"భయపడకు జలజా! నేను ఓ రెండు బిందెలు పట్టి ఇస్తాన్లే!"

జలజ ముఖంలో టెన్షన్ చూసి సువర్ణ సానుభూతిగా అంది.

ఆమె అలా అంటుందే కాని ట్యాంకర్ వచ్చాక ఆ గొడవలో ఎవరూ ఎవర్నీ గుర్తుపెట్టుకోరు.

"ఇదిగో ఇపుడే చెప్తున్నాను, ఒక్కొక్కరు ఒక్కొక్క బిందె మాత్రం పట్టుకుని జరిగిపోవాలి. అందరికీ పట్టుకునే ఛాన్స్ ఇవ్వాలి." మూర్తిగారు కరగ్గా ఆదేశాలు జారీ చేస్తున్నారు.

రాంబాబు ట్యాంకర్‌ని ఆ వీధిలోకి తీసుకొచ్చాడో లేదో జనమంతా ట్యాంకర్ మీదికి బెల్లమ్మీద ఈగల్లా, రొట్టె ముక్కపై కాకుల్లా, ఎముక మీద కుక్కల్లా ఎగబడ్డారు.

ఇహ క్యూ సంగతి దేవుడెరుగు!

ఆ కోలాహలానికి ఎదురుగా ఉండే డాక్టరుగారి భార్య కాంపౌండ్ గోడ దగ్గరికి వచ్చి చిద్విలాసంగా నిలబడింది.

ట్యాంకరెప్పుడు వచ్చినా ఆమెకు అదొక పెద్ద ఎంటర్టయిన్మెంట్. నెలకు మూడు వందలిచ్చి రోజుకి మూడు బిందెల చొప్పున నీళ్ళు 'కొనుక్కుంటుందావిడ.'

ఆమెతో పాటు ఈ వ్యవహారాన్నంతా ఎంజాయ్ చేసే మరోవ్యక్తి రాంబాబు.

తోసుకుని, తిట్టుకుని నానా పాట్లు పడి నీళ్ళు నింపుతోన్న జనాన్ని, వళ్ళంతా తడిచి ముద్ద అవుతున్నా లెక్కచేయక ఇళ్ళ వైపు నిండు బిందెలతో పరుగులాంటి నడకతో వెళ్ళే ఆడాళ్ళను చూస్తే అతనికి మహా సరదా! పిల్లికి చెలగాటం, ఎలుకకి ప్రాణ సంకటం అంటే ఇదేనేమో!

జలజ కూడా ఆ గుంపులోకి వెళ్ళాలని ప్రయత్నించింది. మూర్తిగారు యధావిధిగా పంపును పట్టుకుని వేలాడుతున్నారు.

వెనకనించి అంతా జలజను తోస్తున్నారు, ముందున్నవాళ్ళు మీద పడకండని కసుర్తున్నారు.

మొత్తానికి ఎలాగోలా జలజ పంపు దగ్గరికి చేరగలిగింది. బిందెను అతి కష్టం మీద నింపి జరుగుదామని అనుకుంటుండగానే ఎవరో వెనకాల్నించి చాలా రాష్‌గా తోశారు.


ఆ తోపుకి జలజ చేతిలోని నిండు బిందె కాస్తా జారి ట్యాంకర్ కిందికి దొర్లి పోయింది.

"అయ్యో! నా బిందె" అంటూ కిందికి వంగిన జలజని పక్కకి తోసేసి వెనకున్న వాళ్ళు ముందుకి వచ్చేశారు.

ఇక ఆ బిందె సంగతి వదిలేసి జలజ గుంపులోంచి బయటికొచ్చి ఇంకో బిందెను అందుకుంది.

ఇంతలో కోలాహలం మరింత పెరిగిపోయింది ఏవిటా అని చూస్తే ట్యాంకరు కదిలి వెళ్ళిపోతోంది.

దాని వెనకాల ఒకరిద్దరు బిందెలు పట్టుకుని ఒక్క చుక్కయినా దొరక్కపోతుందా అని ఆయాసంగా పరుగెడ్తున్నారు.




జలజకు నిస్సహాయతతో కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. ట్యాంకరు నీళ్ళు కిందపడ్డ చోటంతా బురదగా అయిపోయింది. ఆ బురదలో పడి ఉన్న తన బిందెను అందుకుని మౌనంగా ఇంటికేసి నడిచింది.

ఇంటికెళ్ళి బట్టలు మారుస్తూంటే చేతిపై గాయం కన్పించింది! ఆ గొడవలో తెలీలేదు గాని గాజులు పగిలి, గీరుకుని రక్తం వస్తోంది.

"ఛీ! వెధవ బతుకు," జలజకు విరక్తి కలిగింది. ఒళ్ళంతా తడిచి, బురద కొట్టుకుపోయి, జుట్టంతా చిందరవందరైనా, చేతికి రక్తాలు కారినా నీళ్ళు మాత్రం దొరకలేదు. పై పెచ్చు బిందెలు సొట్టపోయాయి. ఇహ రెండురోజుల దాకా హేండ్‌పంప్ నీళ్ళు తాగనూ లేక, దాహంతో చావనూలేక అవస్థపడాలి.

మర్నాడు ఉదయం నిద్రలేవడంతోటే మూర్తిగారు హార్టటాక్‌తో పోయారన్న వార్త కాలనీ అంతా వ్యాపించి. 'అయ్యో పాపం!' అంటూ అంతా వెళ్ళి సంతాపం వ్యక్తం చేసి వస్తున్నారు. ఆ మధ్యాహ్నం వరకూ అంత్యక్రియల ఏర్పాట్లు జరిగాయి.

వీధి వీధంతా ఒకలాంటి సంతాప వాతావరణం ఆవరించి ఉంది. గేటువద్ద నిలబడి జలజకూడా మూర్తిగారి అంతిమ యాత్రను చూస్తోంది. ఇంతలో ఉన్నట్టుండి పక్కనే నిల్చున్న దుర్గమ్మగారు.

"పోతే పోయాడ్లెండి మహానుభావుడు, ఇహనైనా ట్యాంకర్ దగ్గర నీళ్ళు ప్రశాంతంగా పట్టొచ్చు" అన్నారు.

అది విన్న జలజ ఎంత షాక్ తిందంటే ఆమెకు ఏమనాలో తోచలేదు, ఒక్కక్షణం!

ఇన్ని రోజులూ తను కేవలం మంచి నీళ్ళు కొనుక్కునే రోజులు వచ్చేశాయని ఆశ్చర్యపోయేది.

కాని ఇప్పుడు సాటి మనిషిపోతే, "ఆహా! నీళ్ళకు హాయి!" అని అనుకునే రోజులొచ్చేశాయి!

ఇలాంటి పరిస్థితులను సృష్టించిన మునిసిపాలిటీని మెచ్చుకోవాలో లేక మనిషి ఆలోచనా విధానాన్ని ఇంతగా దిగజార్చిన జలమహాత్యాన్ని కొనియాడాలో తెలీలేదు ఆమెకు.

ఏదేమైనా మనిషిలోని కనీస మానవత్వపు విలువల్ని కూడా పాగొడ్తోన్న వాటర్ ట్యాంకర్‌ని తిట్టుకోవాలో.. ఎండిపోతోన్న గొంతుని అప్పుడప్పుడు.. తడుపుతున్నందుకు జోహార్లర్పించాలో తెలీక వెర్రిమొహం వేసింది!★